

ఎంపీ రఘురామకృష్ణంరాజుకు ఊరట

హైకోర్టు ఉత్తర్వులతో జిల్లాకు వచ్చేందుకు లైన్ క్లియర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు హైకోర్టులో ఊరట లభించింది. తాను సొంత జిల్లాకు వెళ్తే ప్రభుత్వం అరెస్టు చేసే అవకాశం ఉందని, రక్షణ కల్పించాలని రఘురామకృష్ణంరాజు హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు 41ఎ ప్రొసీజర్ పాటిస్తూ ఎంపీకి రక్షణ కల్పించాలని పేర్కొంది. కనుమూరి రఘురామకృష్ణంరాజు 2019లో వైసిపి తరపున నరసాపురం ఎంపీగా గెలిచారు. తర్వాత కొద్దిరోజులకే వైసిపి అధిష్టానంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఆయనపై సిఐడి కేసు నమోదు, అరెస్టు చేయడం వంటి పరిణామాలు జరిగాయి. దాదాపు మూడేళ్లుగా ఆయన జిల్లాకు రాని పరిస్థితి ఉంది. ఎన్నికలు రానుండటంతో జిల్లాకు వచ్చేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. ప్రభుత్వం మళ్లీ కేసులు పెట్టి అరెస్టు చేస్తుందనే కారణంతో ముందుగానే ఆయన హైకోర్టును ఆశ్రయించి ఊరట పొందారు.

ఎవరికి.. ఎర్త్ బెర్త్

రిజర్వుడు స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థుల మార్పు

జనరల్ స్థానాల్లో మార్పులపై వెనక్కి తగ్గినట్లు ప్రచారం

ఏలూరు ఎంపీ స్థానానికి కొత్తముఖం, నరసాపురంపై వీడని ఉత్కంఠ

టిడిపి, జనసేన అభ్యర్థులపై కొనసాగుతున్న అస్పష్టత



ఎన్నికల్లో గెలుపు గుర్రాల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. అధికార వైసిపి ఇప్పటికే పలు మార్పులు, చేర్పులు చేపట్టగా ప్రతిపక్ష పార్టీలు ఇంకా అభ్యర్థులపై ఒక స్పష్టతకు రాని పరిస్థితి కన్పిస్తోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రిజర్వుడు స్థానాలైన చింతలపూడి, పోలవరం స్థానాల్లో అభ్యర్థులు మార్పు పూర్తి చేసిన వైసిపి, జనరల్ స్థానాల్లో మార్పులకు మాత్రం జంకుతున్నట్లు తెలుస్తోంది. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజును మార్చాలని వైసిపి నిర్ణయించింది. దీంతో తనకు టిక్కెట్ ఇవ్వకపోతే తన భార్యకు ఇవ్వాలంటూ బాలరాజు చేసిన ప్రయత్నం ఫలించింది. పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తెల్లం బాలరాజు భార్య రాజ్యలక్ష్మిని వైసిపి అధిష్టానం ప్రకటించింది. దీంతో వచ్చే ఎన్నికల్లో తెల్లం రాజ్యలక్ష్మి పోటీలో ఉండనున్నట్లు స్పష్టత వచ్చింది. చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా మార్పు తథ్యమని వైసిపి ఎప్పటి నుంచో సంకేతాలిస్తూ వచ్చింది. చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఏలూరులో రవాణా శాఖాధికారిగా పని చేసిన కంభం విజయరాజు పేరును వైసిపి అధిష్టానం గురువారం రాత్రి ప్రకటించింది. విజయరాజు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు స్వయానా వియ్యంకుడు. మోషేన్‌రాజు లాబీయింగ్‌తోనే జయరాజుకు టిక్కెట్ వచ్చినట్లు చర్చ సాగుతోంది. రిజర్వుడు స్థానాల్లో వేగంగా అభ్యర్థులను మార్చిన వైసిపి జనరల్ స్థానాల్లో మార్పులకు మాత్రం వెనుకాడుతుందని తెలుస్తోంది. ఆచంట, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు వంటి చోట్ల అభ్యర్థుల మార్పు తథ్యమని తొలుత వైసిపి సంకేతాలు ఇచ్చింది. అక్కడ తగిన అభ్యర్థులు దొరకకపోవడం, మార్పులు తర్వాత వచ్చే వ్యతిరేక సంకేతాలను దృష్టిలో పెట్టుకుని ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. దీంతో పలుస్థానాల్లో అభ్యర్థుల మార్పు ఉంటుందా.. లేదా అనే చర్చ నడుస్తోంది. ముఖ్యంగా ఎంపీ స్థానాలకు అభ్యర్థులు దొరక్క అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని ముందుగానే స్పష్టత ఇచ్చారు. దీంతో ఏలూరు ఎంపీ అభ్యర్థి ఎవరనే చర్చ కొద్దికాలంగా సాగుతోంది. అనుహ్యంగా తణుకు ఎంఎల్ఎ, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్‌ను ఏలూరు ఎంపీ అభ్యర్థిగా వైసిపి గురువారం ప్రకటించింది. ఎంపీ అభ్యర్థిగా ఉండేందుకు సునీల్‌కుమార్ ముందు అయిష్టత వ్యక్తం చేసినా ఖర్చు విషయంలో సగం మాత్రమే పెట్టుకుంటే సరిపోతుందని, మిగిలిన ఖర్చు పార్టీ పెట్టుకుంటుందని భరోసా ఇచ్చి బరిలోకి దించుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక నరసాపురం ఎంపీ స్థానానికి ఎవరు బరిలో ఉంటారో ఇంకా స్పష్టత రాలేదు.

కొలిక్కిరాని టిడిపి, జనసేన అభ్యర్థుల ఎంపిక

ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేన పొత్తుతో ఈ ఎన్నికల్లో పోటీకి దిగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కాపు సామాజిక తరగతి ఎక్కువగా ఉండటంతో జనసేన బలంగా ఉంది. దీంతో జిల్లాలో దాదాపు సగం స్థానాలను జనసేన కోరినట్లు తెలిసింది. ఉంగుటూరు, ఏలూరు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు వంటి పలు స్థానాలను జనసేన అడిగినట్లు చెబుతున్నారు. జనసేనకు ఎన్నిస్థానాలు కేటాయిస్తారో ఇంకా స్పష్టత లేదు. దెందులూరు టిక్కెట్ చింతమనేనికి కాకుండా ఏలూరులో పని చేస్తున్న న్యాయవాదికి ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక రిజర్వుడు స్థానాలు, చింతలపూడి, పోలవరం అభ్యర్థులపైన టిడిపిలో స్పష్టత లేకుండాపోయింది. ముఖ్యంగా ఎంపీ స్థానాల్లో అభ్యర్థులు ఎవరనేది తేలని పరిస్థితి నెలకొంది. దీంతో ఆశావహులు టిక్కెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో సమగ్ర అంతర్ జిల్లాల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సమగ్ర అంతర్ జిల్లాల చెక్ పోస్టులు ఏర్పాటుపై జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, వివిధ మండలాల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ కలెక్టరు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలో ప్రస్తుతం ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. యలమంచిలి మండలం చించినాడ, భీమవరం మండలం లోసరి, పెనుగొండ మండలం సిద్ధాంతం, ఆకివీడు మండలం దుంపగడప, తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, జిఎస్‌టి, సెబ్, ఎక్సైజ్, అటవీశాఖ, రవాణా శాఖ అధికారులు, సిబ్బందిని ఈ చెక్ పోస్టుల వద్ద నియమించాలన్నారు. మద్యం, నగదు, బహుమతులు, ఎన్నికల సమయంలో పంచే ఉచిత పంపిణీ వాహనాలు తనిఖీలు చేసి సామగ్రిని సీజ్ చేయాలన్నారు. డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, జిల్లా కలెక్టరు కార్యాలయ ఎఒ వైకెవి అప్పారావు, ఎన్నికల తహశీల్దార్ వై.దుర్గా కిషోర్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పొన్నపల్లిలో జారిన ఏటిగట్టు

స్థానికుల ఆందోళన - నాసిరకంగా నిర్మించారని నేతల నిరసన

నరసాపురం టౌన్:పట్టణంలోని పొన్నపల్లిలో రూ.26 కోట్లతో నిర్మాణంలో ఉన్న ఏటిగట్టు కొంతమేర ఒక్కసారిగా గోదావరిలోకి జారిపోయింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఏటిగట్టు మధ్యాహ్నం 3 గంటల నుంచి కోతకుగురవుతూ వస్తోంది. గుర్తించిన స్థానికులు భయంతో పరుగులు తీశారు. ప్రస్తుతం వరద లేకుండానే గట్టు కోతకు గురి కావడంతో అభివృద్ధి పనుల్లో నాణ్యతపై పొన్నపల్లి వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ ప్రసాదరాజు, ఛైర్ పర్సన్ శ్రీవెంకట రమణ, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ శ్రీనివాసరాజు, తహశీల్దార్ ఎస్‌ఎం.ఫాజిల్ అక్కడికి చేరుకుని అధికారులను అప్రమత్తం చేశారు. ఏటిగట్టును పటిష్టపర్చాలని ఆదేశించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాయకులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, బొమ్మిడి నాయకర్, కొవ్వలి రామ్మోహన్ నాయుడు, పులపర్తి వెంకటేశ్వరరావు ఏటిగట్టును పరిశీలించారు. నాసిరకం రాళ్లతో పనులు చేపట్టారని, పనుల్లో స్థానిక ఎంఎల్ఎ హస్తముందని విమర్శించారు. వెంటనే ఏటిగట్టు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి యుద్ధప్రాతిపదికన పుణనిర్మాణం చేపట్టాలని నిరసన తెలిపారు.


గోదావరిలోకి జారిన ఏటిగట్టు


నిరసన తెలుపుతున్న నేతలు

బకాయిలు విడుదలయ్యే వరకూ పోరాటం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఆర్థిక బకాయిలు విడుదలయ్యే వరకూ యుటిఎఫ్ పోరాటాన్ని కొనసాగిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి తెలిపారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షతన జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపీమూర్తి మాట్లాడుతూ ఆర్థిక బకాయిల కోసం యుటిఎఫ్ ఇప్పటికే అనేక దశలవారీ పోరాటాలు చేసిందని తెలిపారు. ప్రజాప్రతినిధులకు మెమోరాండాలు ఇవ్వడం, డివిజన్ కేంద్రాల్లో ఆరు గంటల ధర్నా, జిల్లా కేంద్రంలో 12 గంటల ధర్నా చేసినట్లు తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల ధర్నా చేయడానికి యుటిఎఫ్ ప్రయత్నించగా ప్రభుత్వం అనుమతివ్వకపోవడం సరికాదని, ధర్నాకు వెళ్లకుండా స్కూళ్లు, ఇళ్ల వద్దకు పోలీసులొచ్చి నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. విజయవాడ చేరుకున్న వేలాది మంది ఉపాధ్యాయులను అరెస్టులు చేసి వివిధ ఫంక్షన్ హాల్లో బంధించడాన్ని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా తమ ఆర్థిక బకాయిలు రూ.1,896 కోట్లు విడుదల చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర కమిటీ మరోసారి దశలవారీ పోరాటాలకు పిలుపునిచ్చిందని, దీనిలో భాగంగా జనవరి 14న భోగి రోజు అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ నియంతృత్వ ధోరణులను భోగి మంటల్లో తగలబెడతామన్నారు. 19న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన నిర్వహించి, 24న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తామని, అప్పటికీ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోతే మరోసారి రాష్ట్రస్థాయి పోరాటానికి వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ సాయంత్రం భీమవరం, నరసాపురం, పాలకొల్లు, మార్టేరు, తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో, 24వ తేదీ సాయంత్రం భీమవరం జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దశలవారీ పోరాటంలో ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు కోసం రాష్ట్రస్థాయిలో ఈ నెల 28వ తేదీన పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, డి.ఏసుబాబు, సిహెచ్.కుమార్‌బాబ్జి, రాష్ట్ర కౌన్సిలర్ జివి రామానుజరావు, నాయకులు బి.నాగబాబు, సిహెచ్.ప్రసాదరావు, మల్లుల శ్రీనివాసరావు, రాపాక వెంకన్న బాబు, బి.వీరబాబు, పి.సీతారామరాజు, కె.సత్యలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపీమూర్తి

రాయితీ విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోండి

ఎపి రొయ్య రైతుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జికె. సుబ్బరాజు

ప్రజాశక్తి - వీరవాసరం

గతంలో విద్యుత్ రాయితీ పొందలేకపోయిన వారు, కొత్తగా ఆక్వాసాగు చేస్తున్న పది ఎకరాల్లోపు ఉన్న రైతులు ప్రభుత్వం కల్పించిన విద్యుత్ రాయితీ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎపి రొయ్య రైతుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జికె.సుబ్బరాజు తెలిపారు. వీరవాసరంలో తులసీ కన్‌వెన్షన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను తెలిపారు. గతంలో కొంతమంది రైతులు తమ ఆక్వాసాగుకు సంబంధించిన వివరాలు సాంకేతిక లోపంతో ఆక్వా చెరువుగా మ్యాపింగ్ జరగలేదని, ఈ విషయాన్ని అప్పడ రాష్ట్ర వైస్ ఛైర్మన్ వడ్డె రఘురాం సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఆయా రైతులు వెంటనే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఆదేశాలిచ్చారని తెలిపారు. అవకాశం ఉన్న ఆక్వా రైతులు తక్షణం రాయితీ విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం రాయితీ విద్యుత్ ఇప్పిస్తామంటూ కొంత మంది దళారులు బయలుదేరారన్నారు. అవటువంటి వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అప్పడ రాష్ట్ర వైస్ ఛైర్మన్ వడ్డె రఘురాంకు క్యాబినెట్ హోదా కల్పించడం పట్ల ఆక్వా రైతు సంఘాల నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ క్యాబినెట్ హోదా వల్ల మరింత సులభతరం అవుతుందని తెలిపారు. అనంతరం రొయ్య రైతుల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ మళ్ల రాంబాబు మాట్లాడారు. వీరవాసరం మండల రొయ్య రైతుల సంఘం నాయకులు నాగరాజు గోపాలకృష్ణంరాజు, యరకరాజు గోపాలకృష్ణంరాజు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, గుండా నరసింహారావు, జుత్తిగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్టేట్ జాయింట్ సెక్రటరీ రాంబాబు

కోటి సంతకాలతో అంగన్‌వాడీల నిరసన


అత్తిలిలో..

32వ రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం భీమవరంలో శుక్రవారం నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 32వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ జిల్లా కార్యదర్శి కళ్యాణి, ఉపాధ్యక్షులు హసీనా మాట్లాడారు. వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఎండి మున్నార్ కమల్ పాషా, బార్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు న్యూటన్ బాబు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, యూనియన్ నాయకులు జి.విజయలక్ష్మి, శాంతకుమారి, దుర్గ, వెంకటలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : కచేరీ సెంటర్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు ఆటపాటలతో ముఖ్యమంత్రికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో మైలె విజయలక్ష్మి, పిఎన్‌వి.లక్ష్మి, కె.మోజారాణి, ఎ.సత్యవతి, సువర్ణకుమారి, శోభారాణి, ధనలక్ష్మి, దుర్గమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : తెలుగు ప్రజలకు ఎంతో ముఖ్యమైన సంక్రాంతి పండగ సమయంలో కూడా అంగన్వాడీలు ఆందోళన చేసేవిధంగా చేయడం ప్రభుత్వానికి మంచిది కాదని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. కోర్టు వద్ద 32వ రోజు సమ్మెలో భాగంగా ముఖ్యమంత్రికి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, కనక దుర్గ, ప్రమీల, వసంతకుమారి, మణిమాలతి, జ్యోతి, రాజకుమారి, ధనలక్ష్మి, మంగతాయారు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : అంగన్వాడీలు 32 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించడం దారుణమని సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. ఎస్మా జిఒ కాగితం నాలుక గీసికోవడానికా అంటూ నాలుక గీసుకుంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, అంగన్వాడీ సెక్టార్ నాయకులు సాయి మహాలక్ష్మి, మౌనిక, సరస్వతి పాల్గొన్నారు.

కాళ్ల : చర్చల్లో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే పండగ తరువాత ప్రభుత్వంతో యుద్ధమే జరుగుతుందని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు లీడర్ దావులూరి మార్తమ్మ హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె 32వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా భోగి మంటల్లో ఎస్మా జిఒ కాపీని వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గపు చర్యని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని విమర్శించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 32వ రోజుకు చేరింది. కర్రి నాగేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపారాణి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కమిటీ నాయకులు యడవల్లి వెంకట దుర్గారావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.


ఆకివీడులో సంతకాల సేకరణ

గణపవరం : 32వ రోజు సమ్మెలో దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు ముగ్గులు రూపంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ మండల కమిటీ నాయకురాలు బి.రామకోటి, బి.మహాలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ధనలక్ష్మి బి.పార్వతి, కెవి మహాలక్ష్మి, జయలక్ష్మి, కళ్యాణి పాల్గొన్నారు.

పెనుగొండ: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వి.నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం 32వ రోజు అంగన్వాడీలు కుటుంబ సభ్యులతో కూర్చున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, సిఐటియు నేతలు ఎస్.వెంకటేశ్వరరావు, ఎల్.ఉషశ్రీ, సిహెచ్.త్రివేణి, కె.శాంతి శ్రీదేవి పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ప్రజల నుండి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు.

పోడూరు : తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు 32వ రోజు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, సిఐటియు నాయకులు పిల్లి.ప్రసాద్, బూరాబత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

అత్తిలి : 32న శుక్రవారం అంగన్‌వాడీలు అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులను రాకెట్లుగా చేసి చెవిలో పెట్టుకుని భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్, మండల కార్యదర్శి కర్రి ధర్మేంద్ర, కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్ పాల్గొన్నారు.

పెంటపాడు : అంగన్వాడీల సమ్మె 32వ రోజుకు చేరింది. ఈ మేరకు శిబిరం వద్ద సంతకాల సేకరణ, ముగ్గులు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, నాయకులు జె.శ్యామలకుమారి, ఆర్.అనురాధ, వి.కనకమహాలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడారు. జయలక్ష్మి సిహెచ్.శ్రీదేవి, హైమ, వెంకటలక్ష్మి, నాగమణి, శిరీష, మంగతాయారు, పి.దుర్గ పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. ఈ మేరకు శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సిఐటియు మండల అధ్యక్షులు పెంకి అప్పారావు మాట్లాడారు. కార్యక్రమంలో తవిటినాయుడు, కృష్ణకుమారి, పైడేశ్వరి, కె.కృష్ణకుమారి, భాను, భవాని, అమోజీ పాల్గొన్నారు.

ఉండి : పండుగ సమయాల్లో కూడా అంగన్వాడీలు తమ డిమాండ్లు నెరవేర్చుకునేందుకు సమ్మెలో పాల్గొంటున్నారని సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 32వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీలు చైతన్య, గడి కుసుమ, వీరవల్లి వెంకటలక్ష్మి, జయశ్రీ, అనురాధ, ప్రేమలత, లలిత కుమారి, ఝాన్సీ, సత్యవేణి పాల్గొన్నారు.

పాలకోడేరు: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు విమర్శించారు. 32వ రోజు సమ్మెలో భాగంగా జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. అలాగే సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గాదం నానాజీ, అంగన్వాడీలు విజయలక్ష్మి, విమల, సోని, మంగతాయారు, నాగలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

పాలకొల్లు : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఆటపాటలతో సమ్మె కొనసాగించారు. సమ్మెకు సిఐటియు నేతలు మద్దతు తెలిపారు.


పెంటపాడులో ముగ్గులు వేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రాణత్యాగానికైనా సిద్ధం

పిఎఫ్ కార్యాలయాన్ని ముట్టడించిన రిటైర్డ్ ఆర్‌టిసి ఉద్యోగులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ప్రాణత్యాగానికి సైతం వెనుకాడబోమని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్ జాతీయ పోరాట సమితి జెఎసి నాయకులు ఎస్ఎస్.రావు, అబ్రహాం మోడీ సర్కారును హెచ్చరించారు. జాతీయస్థాయి పిలుపులో భాగంగా పింఛను రూ.వెయ్యి నుంచి రూ.7,500లకు పెంచాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఆర్‌టిసి ఉద్యోగులు భీమవరంలో శుక్రవారం ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి.సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ జీవితాంతం ఆర్‌టిసికి సేవలందించామని, చాలీచాలని జీతాలతోనే జీవితం గడిచిపోయిందని తెలిపారు. ఇప్పుడిస్తున్న వెయ్యి రూపాయల పింఛను రూ.7500లకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సామాజిక పింఛను రూ.3 వేలు ఇస్తోందని, దాన్ని రూ.7 వేలకు పెంచాలని సిపిఐ, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.వెయ్యి పింఛను వృద్ధాప్యంలో ఉన్న తమకు ఏమాత్రమూ సరిపోవని స్పష్టం చేశారు. తమకు మెడికల్ అలవెన్సులు మంజూరు చేయాలని, ఉచిత వైద్యం అందించాలని, ఆటోమెటిక్ డిఎ వర్తింపజేయాలని నాయకులు డిమాండ్ చేశారు. పింఛను పెంచుతామని కేంద్ర కార్మిక శాఖా మంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గవర్రాజు, మాణిక్యాలరావు, భీమవరం, నర్సాపురం, తణుకు డిపోలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమం గాలికి

సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి

తణుకు రూరల్:గీత కార్మికుల సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం మరచిందని ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి విమర్శించారు. శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం తణుకులోని అమరవీరుల భవనంలో జరిగింది. ఈ సమావేశంలో మునిస్వామి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకొచ్చిన తర్వాత గీతవృత్తిని కాపాడడం పోయి నిర్వీర్యం చేసే పరిస్థితి వచ్చిందన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ నేడు గీత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. ప్రమాదవశాత్తూ తాటి, ఈత చెట్లపై నుంచి పడి వికలాంగులైన, మరణించిన వారికి ప్రభుత్వం రూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదన్నారు. తాటిచెట్లకు మార్కింగ్ విధానం లేకపోవడం వల్ల రియల్ ఎస్టేట్ వారు చెట్లను నరికివేసి గీత కార్మికుల పొట్ట కొడుతున్నారన్నారు. చెట్లు పెంచుకోవడానికి జిఒ 560 ప్రకారం ఐదెకరాల భూమి ఇవ్వాలని ఉన్నా ప్రభుత్వం ఇచ్చిన దాఖలు లేవన్నారు. అనేక విషయాలను రాష్ట్ర మహాసభల్లో చర్చించి కార్మికుల కర్తవ్యాలను రూపొందించుకుని అమలు జరిగే వరకూ పోరాడతామని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణం, కడలి పాండు, జిల్లా జాయింట్ సెక్రటరీ దాసరి సూరిబాబు, జిల్లా కమిటీ సభ్యులు వీర రాఘవులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుతం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.రామసుందర్ రెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకూ వ్యక్తి గత కారణాలపై సెలవు పెట్టనున్నారు. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా విధులు నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోపల్లెలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

కాళ్ల :పాఠశాలలో పూర్వ విద్యార్థుల విరాళాలతో చేపట్టిన అభివృద్ధి పనులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. కోపల్లె గ్రామంలో శ్రీమంతెన దుర్గరాజు రాజయ్యమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల విరాళాలతో చేపట్టిన పలు అబివృద్ధి పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. రూ.19 లక్షలతో సైకిల్ షెడ్డు నిర్మాణం, మినరల్ వాటర్ ప్లాంట్, సిమెంట్ రోడ్డు నిర్మాణం, గార్డెన్ అభివృద్ధి పనులు చేపట్టారు. అనంతరం పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), ఐఐటి బొంబాయి ప్రొఫెసర్ వివిఎన్.రాజు, ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, మంతెన రామ్‌కుమార్‌రాజు, వేగేశ్న రామరాజు, కొత్తపల్లి బంగార్రాజు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, బాలం వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.



క్రీడాకారులతో సర్పంచి అనూష సత్యనారాయణ

వాలీబాల్ పోటీల్లో పెన్నాడ జట్టు విజయం

ప్రజాశక్తి - పాలకోడేరు

యువత క్రీడల్లో రాణించి గ్రామానికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పెన్నాడ అగ్రహారం సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పెన్నాడ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక సచివాలయం వద్ద క్రీడాకారులను సర్పంచి అనూష సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని తిల్లపూడిలో గ్రామ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో 8వ తేదీన ప్రారంభమైన క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఫైనల్‌లో తిల్లపూడి జట్టు విజయం సాధించింది. రూ.20 వేల నగదు, ట్రోఫీ గ్రామ సర్పంచి నడపన శ్రీనివాసరావు, కామిశెట్టి స్వామి అయ్యప్పనాయుడు చేతుల మీదుగా అందించారు. రెండో బహుమతిని పాలమూరు జట్టుకు రూ.పది వేలు, మూడో బహుమతి తోలేరు జట్టుకు రూ.ఐదు వేలు అందించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని జిల్లా వైద్య శాఖాధికారి పి.మహేశ్వరరావు అన్నారు. మండలంలోని కాశిపాడులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - గణపవరం

రబీ పంటకు రైతులకు కావాల్సిన ఎరువులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని గణపవరం మండల వ్యవసాయ బోర్డు సలహా ఛైర్మన్ కూచంపూడి జగపతిరాజు తెలిపారు. మండలంలోని సరిపల్లిలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల వ్యవసాయ సలహా బోర్డు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత ఇటీవల మృతి చెందిన రైతు నాయకులు శ్రీనివాస్‌కి సంతాపం తెలిపారు.

బాధిత మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆపదలో ఉన్నవారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేగొండి మురళీకృష్ణ (చిన్న) అన్నారు. మండలంలోని పేరుపాలెం పెద్దపేటలో ఉన్న వద్ద కొప్పినేని యేసు ఇటీవల మరణించారు. ఆయన భార్య అనారోగ్యంతో, ఆర్థికంగా కూడా ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని మురళీకృష్ణ జనసైనికుల ద్వారా తెలుసుకున్నారు. దీంతో శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు.

వంతెనకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మండలంలోని చినమామిడిపల్లి వంతెన ప్రమాదకరంగా ఉన్నా ఎంఎల్‌ఎ, అధికారులు పట్టించుకోవడంలేదని దారుణమని మాజీ జడ్పిటిసి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. చినమామిడిపల్లి వంతెనను ఆయన శుక్రవారం పరిశీలించారు. నెల రోజుల్లో ఈ వంతెన మరమ్మతు పనులు చేపట్టకపోతే ఇక్కడే ధర్నా చేపట్టి నిరసన తెలియజేస్తామని చెప్పారు.

'టిడిపితోనే అందరికీ న్యాయం'

ప్రజాశక్తి - ఉండి

టిడిపితోనే అందరికీ న్యాయం చేకూరుతుందని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని పాందువ్వ గ్రామంలో పార్టీ మండలాధ్యక్షులు కరిమేరక నాగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం, ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన బలపరిచే అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నేటి నుంచి మావుళ్లమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం శ్రీమావుళ్లమ్మ 60వ జాతర మహోత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 13వ తేదీన ప్రభుత్వ విప్ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అమ్మవారి గ్రామోత్సవం, సాయంత్రం మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల చే ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు.

'బిసిలకు టిడిపితోనే గుర్తింపు'

ప్రజాశక్తి - ఉండి

టిడిపిలోనే బిసిలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని పాందువ్వలో టిడిపి మండల అధ్యక్షులు కరిమేరక నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన బిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, నియోజకవర్గ పరిశీలకులు కొత్త నాగేంద్రకుమార్ మాట్లాడుతూ బడుగు బలహీనుల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బడుగు బలహీనులు టిడిపికి అండగా నిలవాలని కోరారు.

టిడిపిలోకి అల్లూరి వెంకట్రాజు

ఉండి : వైసిపి సీనియర్ నేత, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అల్లూరి వెంకట్రాజు ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. వెంకట్రాజుతో పాటు ఆయన అనుచరులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి : ఉండి గ్రామంలోని డంపింగ్ యార్డ్ వద్ద పేకాట స్థావరంపై ఉండి పోలీసులు శుక్రవారం దాడి చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28,530 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు.

పందెం కో'ఢీ'

కోడిపుంజులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న పెంపకందారులు
బరుల కోసం పందెంరాయుళ్ల ఎదురుచూపు



గాబుల్లో ప్రత్యేకంగా పెరుగుతున్న పందెం కోళ్లు

ప్రజాశక్తి - కాళ్ల

సంక్రాంతి వస్తోందంటే చాలు.. ఎపిలో కోడిపందేలకు సై అంటుంటారు పందెంరాయుళ్లు. కానీ ఈ సారి పందేల నిర్వహణపై ఉత్కంఠ కనిపిస్తోంది. కోడి పందాల కోసం నెలల తరబడి కోళ్లను పెంచే వారున్నారు. ఇక పందెంరాయుళ్లు మంచి పందెం కోడి కోసం ఊళ్లు తిరుగుతూ పుంజులు కొనుగోలు చేస్తుంటారు.

వ్యాపారమే లక్ష్యంగా పెంపకం

పందెంరాయుళ్లకు పందెం పుంజుల పెంపకం అభిరుచి(ఓ హాబీ). తమ పొలం, చెరువుల్లో, గెస్ట్ హౌస్‌ల్లో కోడి పుంజులను మరింత శ్రద్ధగా పెంచుతున్నారు. ఒక వ్యక్తి 20 నుంచి 30 కోళ్లు ప్రత్యేక షెడ్డుల్లో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ఒక్కో పుంజు రూ.20 వేల రూ.60 వేల ధర పలుకుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

పెంపకం ప్రత్యేకం

కొందరు పుంజులను పెంచి సంక్రాంతి సమయంలో విక్రయిస్తారు. ఈ జిల్లాలో కూడా అక్కడక్కడా గ్రామాల్లో కోడిపుంజుల పెంపకం హాబీగా పెట్టుకున్న వారు కూడా ఉన్నారు. పందెం కోళ్ళు సుమారు 50 రకాలు ఉన్నాయి. వీటిలో కాకి, డేగ, నెమలి పందేలకు పెట్టింది పేరు. ఈ కోళ్ల ఆయా సైజులు, జాతిని బట్టి రూ.పది వేల నుంచి రూ.లక్షల్లో ధరలు ఉంటాయి.

పందేల్లో దింపే కోడిపుంజుల పెంపకం వెనుక కఠోర శ్రమ ఉంటుంది. సంక్రాంతికి నాలుగు నెలలు ముందుగానే బాగా పోట్లాడే పుంజులను ఎంపిక చేసి వాటికి శిక్షణ ఇస్తారు. వీటి పెంపకం కోసం జీతగాళ్లను ఏర్పాటు చేస్తారు.



నీటితొట్టెలో ఈదుతున్న కోడిపుంజు

నిర్వాహకులు ఒక పందెం సొమ్ములో కనీసం పది శాతాన్ని వసూలు చేస్తారు. ఒక్కో బరిలో రోజుకు రూ.10 లక్షల నుంచి రూ.30లక్షల వరకు కమీషన్ల రూపంలోనే చేతులు మారుతుందని అంటున్నారు. కానీ సంప్రదాయం పేరుతో సాగే ఈ కోడిపందేల్లో డబ్బే పరమావధి అని, కొందరు డబ్బు సంపాదన కోసం ఈ విషసంస్కృతికి తెరలేపారన్న విమర్శలున్నాయి.

కోడిపుంజులకు పోరాట పటిమ పెంచుతాం
శివరామరాజు, పెంపకందారుడు, కాళ్లకూరు

పుంజులను ప్రత్యేకంగా పెంచి పందేలకు సిద్ధం చేస్తాం. ఐరన్ మెస్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన సెల్స్‌లలో పెట్టి పెంచాలి. వారానికి ఒకసారి కత్తులు కట్టకుండా పందెలు వేస్తూ పోరాట పటిమ పెంచుతాం. ఆ సమయంలో కోళ్లు ఒత్తిడికి గురి కాకుండా గాయాలు పాలు కాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటాం. ఇప్పటికే కోళ్లకు ప్రత్యేక శిక్షకులతో శిక్షణ ఇస్తున్నాం. పందెలకు పుంజులను సిద్ధం చేస్తున్నాం.

యల్లాప్రగడ సుబ్బారావుకు భారతరత్న ఇవ్వాలి

జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రపంచ మానవాళి ప్రాణప్రదాత, తెలుగుతల్లి ముద్దుబిడ్డ భీమవరం వాసి డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావుకు భారతరత్న ఇవ్వాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు అన్నారు. డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జయంతి సందర్భంగా రామలక్ష్మణనగర్‌లో యల్లాప్రగడ పార్కులోని సుబ్బారావు విగ్రహానికి జనవిజ్ఞాన వేదిక డివిజన్ గౌరవ అధ్యక్షులు నంద్యాల భాస్కర్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రి వద్ద విగ్రహానికి ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ మొగిలి వీరాస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్ట ర్ యల్లాప్ర గడ ఫౌండేషన్ ఛైర్మన్ మెంటే సుబ్బారావు, మెం టే పార్థ సారథి, డిఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతా రామరాజు, జెవివి నాయకులు చైతన్య ప్రసాద్, సిహెచ్.పట్టాభిరామయ్య, మల్లుల శ్రీనివాస్, రేపా క వెంక న్న బాబు, ఎ.లోకేష్, సుకుమార్, విజ్ఞాన వేదిక నాయకులు చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : యల్లాప్రగడ సుబ్బారావు తన పరిశోధనలతో కనిపెట్టిన ఔషధాలు మనిషి జీవితం మనుగడకు దోహదపడుతున్నాయని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో యల్లాప్రగడ సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రవ



భీమవరం : జయంతి వేడుకల్లో జెవివి జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రావు

ానికి వైసిపి యూత్ లీడర్ కొట్టు విశాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగడాల సూర్యానా రాయణ, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విబిటి. రాజు, జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ ప్రత్తి వీరాస్వామి, ఆసరా ఛైర్మన్ కొడాలి రమేష్ బాబు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

గణపవరం : స్థానిక సరిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారా మెడికల్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా తణుకు భాను ఆసుపత్రి డాక్టర్ రవితేజ షుగరు, బిపి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ మండలాధ్య క్షులు ఎం.సత్యనారాయణమూర్తి, జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె పరమేశ్వరులు అధ్యక్షత వహించారు.

అమరులకు యుటిఎఫ్ నివాళి

భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ పత్రిక ప్రథమ ప్రధాన సంపాదకులు మైనేని వెంకటరత్నం వర్థంతి, యల్లాప్రగడ సుబ్బారావు, స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి. రామభద్రం, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, డి.ఏసుబాబు, సిహెచ్.కుమార్‌బాబ్జి, రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు పాల్గొన్నారు.

యువతకు మార్గ నిర్దేశకుడు వివేకానంద

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వివేకానంద బోధనలు అనుసరణీయమని, యువతకు మార్గ నిర్దేశకుడు వివేకానంద అని జిల్లా గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, లయన్ జికె.ఆనంద్ అన్నారు. వివేకానంద జయంతి వేడుకలు స్థానిక సుబ్బారావుపేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు బడుగు చంద్రశేఖర్, కుందుం వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జి.మురళీకృష్ణ, ఎరుబండి రాంప్రసాద్, లయన్ కోప్పెళ్ల సత్యనారాయణ రాజు, వాకర్స్ రాగిరెడ్డి, గురజాడ సుధాకర్ పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లయన్స్ హాలులో సుమారు వంద మంది పేద వృద్ధులకు దుప్పట్లు, భోజనాలు పంపిణీ చేశారు. సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంవి.సూర్య నారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో విజయ భారతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉర్దూలెంట్ కమిటీ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య, ఆదర్శ మోటుపల్లి శ్రీనివాసు, దాత పల్లె అప్పిరెడ్డి పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన జయంతి వేడుకల్లో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

నరసాపురం-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం నుంచి కర్ణాటక రాష్ట్రం హుబ్లీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డి గుంటూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్ నరసాపురం రైల్వే స్టేషన్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసాపురం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎడిఆర్ ఎం శ్రీనివాసరావు, సీనియర్ డిసిఎం వి.రాంబాబు, నరసాపురం స్టేషన్ సూపరిం టెండెంట్ దివాకర్, నార్ని తాతాజీ, కోమటి రవికుమార్, పులపర్తి వెంకటేశ్వర్లు, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లులో స్వాగతం

పాలకొల్లు : నరసాపురం నుంచి పాలకొల్లు వచ్చిన రైలుకు పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ అధ్యక్షులు కారుమూరి నరసింహరావు, వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, వర్తకులు స్వాగతం పలికారు.

ఏలూరుపాడులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కాళ్ల

పూర్వ విద్యార్థులంతా 29 ఏళ్ల తర్వాత కలిసి తమ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. వివిధ వృత్తులు, వ్యాపారులు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా ఒక చోటుకు చేరి ఆటపాటలతో సందడి చేశారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ 1995-96 బ్యాచ్ ఒక ట్రస్ట్‌గా ఏర్పడి పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి సుబ్బరాజు, కొల్లాటి వెంకన్నబాబు, పచ్చిగోళ్ల రామ దుర్గారావు, సంగాని వెంకట్రాజు, జంపన మురళీకృష్ణంరాజు, బుద్ధరాజు మాధవి, దాకారపు సూర్యప్రభ, 162 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

యువతను మంచి మార్గంలో నడిపించే శక్తి క్రీడలకు మాత్రమే ఉందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం బిఆర్ఎంబి మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఎంఎల్‌ఎ కప్, కీర్తిశేషులు చెరుకూరి బుద్ధవతారంరాజు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల ప్రారంభ సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలోయువకులకు వాలీబాల్, క్రికెట్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, బుద్ధ అవతారంరాజు కుమారుడు పెద్ద వర్మ, చెరుకూరి విశ్వనాథరాజు, ఆడిటర్ రామరాజు, డెక్కన్ రామకృష్ణంరాజు, డిఎస్.రాజు, పెచ్చేట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

దొడ్డనపూడిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

కాళ్ల : మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు.



కాళ్ల : దొడ్డనపూడిలో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న సర్పంచి సుబ్బారావు

సుమారు 12 క్రికెట్ జట్లు వరకు పాల్గొనున్నాయి. మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ.10 వేలు, రెండో స్థానం సాధించిన జట్టుకు రూ.5 వేలు అందిస్తారు. ఈ కార్యక్రమంలో యిర్రింకి జగన్, దేశంశెట్టి మధు, ఆరేటి సందీప్, కొల్లి లక్ష్మణస్వామి, చికిలే సత్యానందం, ఆరేటి పద్మారావు, యాతం తేజ, ఆరేటి సత్యకృష్ణ, కొల్లి రమేష్ పాల్గొన్నారు.

గణపవరంలో సంక్రాంతి సంబరాలు

గణపవరం :స్థానిక ఇందిరమ్మ కాలనీలో మన ఊరు మన ఆట పేరుతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మరాజు మాట్లాడారు.

ఆదర్శవంతంగా భీమవరం పట్టణాభివృద్ధి : గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని త్రీ టౌన్‌లో రూ.4.58 కోట్లతో నిర్మించిన రోడ్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా పట్టణాభి వృద్ధికి రూ.వంద కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు చెప్పారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతాయని తెలిపారు. తొలుత రూ.29 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, మారుతినగర్ నుంచి ప్రకృతి ఆశ్రమం కెనాల్ బండ వరకు రూ.1.30 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ. 38 లక్షల నిధులతో నిర్మించిన కముజువారిపాలెంలో సీసీ రోడ్డు ను, డ్రెయిన్‌ను, రూ.1.18 కోట్లతో ప్రకృతి ఆశ్రమం కెనాల్ బండ నుంచి భారతీయ విద్యా భవన్ వరకు నిర్మించిన బీటీ రోడ్డును, రూ.1.43 కోట్లతో పిపి రోడ్డు జంక్షన్ నుంచి భారతీయ విద్యా భవన్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఉండి

జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పెదపుల్లేరు గ్రామపంచాయతీ కార్యదర్శి శివాజీ అన్నారు. గ్రామంలో జూద క్రీడలపై గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. జూద క్రీడల వల్ల యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. ఈ అవగాహన సదస్సులో ఎంపిటిసి సభ్యులు రాయి రాములమ్మ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పెద్దింటి నాగేశ్వరరావు, నాయకులు పప్పుల రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట :మండలంలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆచంట ఎస్ఐ రాజకుమార్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పేకాట, కోడిపందేలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

గణపవరం :పండుగ రోజున కుటుంబాలతో ఆనందంగా గడపాలని, కోడిపందేలు, జూదం వల్ల కుటుంబాలు నాశనమవుతాయని గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. ఎ.గోపవరంలో శుక్రవారం గ్రామ సర్పంచి పాతంశెట్టి పద్మావతి శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వరరావు, తహశీల్దార పి.లక్ష్మి మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పెనుగొండ : మండలంలో కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని చెప్పారు.

18న మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 18వ తేదీన గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ భవనంలో నిర్వహించనున్నట్లు గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి తెలిపారు.

In the Court of the Motor Accident Claims Tribunal, (I Addnl. District Judge) at Khammam

M.A.T. O.P. No. 408 of 2023

Between:
Manyam Suvarnakumari and Others ***...Claim Petitioner***
AND
Morla Sivaji & Others ***...Respondents***

To:
Morla Sivaji, S/o. Srinivasa Rao, age: Major, Occ: Driver cum Owner of the Van bearing No. AP 37 TK - 1889, R/o. D.No. 155, 4th Ward, Sriramavaram, Denduluru (Mandal), Eluru - 534432.

Take notice that the above named Claim Petitioners have filed the above O.P. against the respondents claiming compensation. The above case is stands posted to 06-02-2024 for your appearance. Therefore, you are here by directed to appear before the Hon'ble Court **on 06-02-2024 at about 10.30 A.M.** in person or through an advocate without faiol. Failing which the matter will be decided ex-parte against you.

//By Order of the Hon'ble Court//
YEGINATI NAGESWARA RAO
Khammam Advocate, Khammam
08-01-2024 Cell: 9848368823